రాంనగర్ బతుకమ్మ చౌక్‌లో బతుకమ్మ వేడుకల్లో మహిళలు



బతుకమ్మ వేడుకల్లో బీఆర్ఎస్ నేత ముఠా జైసింహ



ఎంగిలి పూల బతుకమ్మ శోభ

ముషీరాబాద్: అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో ఎంగిలి పూల బతుకమ్మ సంబరాలు రాంనగర్ గుండు వద్ద బతుకమ్మ చౌక్‌లో ప్రారంభమయ్యాయి. మహిళలు, యువతులు తీరొక్క పూలతో అందంగా బతుకమ్మలను తయారు చేశారు. ఆటపాటలతో సందడి చేసి బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకువచ్చారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమానికి ముషీరాబాద్ బీఆర్ఎస్ యువ నాయకులు ముఠా జైసింహ, బీఆర్ఎస్ నాయకులు నేత శ్రీనివాస్, కొండపల్లి మాధవ్, డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ డివిజన్ అధ్యక్షుడు ఆర్.నరేష్, కాంగ్రెస్ నాయకులు విజయ్‌యాదవ్, బొట్టు శ్రీనివాస్, ఖదీర్, గిరి, మాణిక్ ప్రభు, బాల్‌రాజ్‌గౌడ్, వెంకటేష్, హనుమంతుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రీన్ రిచ్ రెసిడెన్సీలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



నల్లకుంట రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద కార్మికులతో కార్పొరేటర్



బర్కత్‌పుర హౌసింగ్‌బోర్డు కాలనీలో బతుకమ్మ వేడుకలు



జ్ఞాన సరస్వతి దేవి మూలవిరాట్



నవరాత్రి మహోత్సవాలకు ముస్తాబైన న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం

అమ్మవారి ఆలయాలు ముస్తాబు

నేటి నుంచి దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం

నల్లకుంట: న్యూ నల్లకుంటలోని శ్రీ సీతారామాంజనేయ సరస్వతి ఆలయం(న్యూ రామాలయం) లో ఈనెల 3 నుంచి (గురువారం) 12వ తేదీ వరకు జ్ఞానసరస్వతి దేవి నవరాత్రి మహోత్సవాలు నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఆలయ ఆవరణలో భక్తుల కోసం ఆకర్షణీయమైన స్వాగత తోరణాలు, చలువ పందిళ్లు కూడా ఏర్పాటు చేశారు. బుధవారం ఆలయ కార్యనిర్వహణాధికారి కె. జయంతి సాక్షితో మాట్లాడుతూ.. శ్రీ జ్ఞాన సరస్వతి దేవి శరన్నవరాత్రి ఉత్సవ వివరాలను వెల్లడించారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో సరస్వతి మాత వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమివ్వనున్నారని చెప్పారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా క్యూ లైన్ల ఏర్పాటు, తాగునీటి వసతి ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నవరాత్రుల్లో సరస్వతి అమ్మవారి అలంకరణ వివరాలు...

03న బాలత్రిపురసుందరి దేవి అలంకరణ ఉంటుంది. అలాగే ఉదయం 9 గంటలకు గణపతి పూజ, స్వస్తివాచనము, ఋత్విక్ వరణము, పంచగవ్య ప్రాశన, అంకురార్పణము, అఖండ దీపారాధన, నవగ్రహ సర్వతోభద్ర మంటపారాధన, కలశ స్థాపన జరుగుతుంది. అలాగే నిత్యం ఉదయం 6 గంటలకు ఉపనిషత్ పూర్వక అభిషేకము, 8.30 గంటలకు చండీహోమము జరుపబడుతుంది. సాయంత్రం 7 గంటలకు మంత్ర పుష్పము, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుందని తెలిపారు.

- 04న శ్రీ మహాలక్ష్మి దేవి, 05న శ్రీ వైష్ణవి దేవి, 06న లలితాత్రిపురసుందరీ దేవి, 07న అన్నపూర్ణా దేవి అలంకరణ , 08న గాయత్రి దేవి, 09న మూలా నక్షత్రం జ్ఞాన సరస్వతి అలకంరణ. ఉదయం సరస్వతి పూజ, 108 కలశముల, 108 లీటర్ల ఆవు పాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేకం, అర్చనలు, నూతన అక్షరాభ్యాస కార్యక్రమాలు ఉంటాయి.
- 10న దుర్గాష్టమి, దుర్గ అలంకారం, 11న మహార్నవమి, మహిషాసురమర్థిని అలంకారం, చండీహోమం, పూర్ణాహుతి ఉంటుంది.
- 12న రాజరాజేశ్వరి అలంకారము, విజయ దశిమి వేడుకలు. సాయంత్రం 5 గంటలకు విజమదశిమి– శమిపూజ ఉంటుంది. ఈ వేడుకల్లో కేంద్ర బొగ్గు గణుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, స్థానిక కార్పొరేటర్ వై. అమృత పాల్గొంటారని ఈవో జయంతి తెలిపారు.
- 13వ తేదిన అమ్మవారి రథోత్సవం ఉంటుందన్నారు. ధార్మిక కార్యక్రమాల వివరాలు ఏ రోజు కారోజు నోటీసు బోర్డులో వివరిస్తామని ఆమె చెప్పారు. అమ్మవారి ప్రత్యేక పూజలో పాల్గొనాలనుకునే భక్తులు ఆలయ అర్చక స్వామి సీతారామ శర్మను సంప్రదించాలని ఆలయ ఈవో జయంతి కోరారు.

హరిద్రగా దర్శనమిచ్చిన శారదాంబ

- శారదా మాతకు భక్తిశ్రద్ధలతో మహాభిషేకం
- జగత్ ప్రసూతిక అలంకరణలో భక్తులకు కనువిందు చేసిన శారదా మాత
- నేటి నుంచి దేవి శరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం



పసుపు అలంకరణలో (హరిద్రా) శారదాంబ




జగత్ ప్రసూతికగా భక్తులకు దర్శనమిచ్చిన శారదాంబ

నల్లకుంట: నల్లకుంట శంకరమఠంలో బుధవారం ఉదయం పండితుల మంత్రోచ్చరణల నడుమ లోకమాత శారదాంబకు మహాభిషేకము కావించారు. అనంతరం అమ్మవారు హరిద్రగా ధర్శనమిచ్చారు. ఆ తర్వాత మఠం అర్చక స్వాములు అమ్మవారిని జగత్ ప్రసూతికగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించగా, భక్తులు నేత్రపర్వంగా ధర్శించుకున్నారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ జరిగింది.

నేటి నుంచి శ్రీశారదా శరన్నవరాత్రి ఉత్సవాలో ప్రారంభం..

శ్రీశారదా శరన్నవ రాత్రి మహోత్సవాలకు శంకరమఠంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శంకరమఠంలో గురువారం(నేటి) నుంచి శారద శరన్నవ రాత్రి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా ఉదయం శక్తి గణపతికి ఆదిపూజలు, చంద్రమౌళీశ్వర స్వామికి విశేష పూజలు ఉంటాయని మఠం నల్లకుంట బ్రాంచ్ హెడ్ కె. కృష్ణారావు తెలిపారు అలాగే అమ్మవారు బ్రాహ్మి అలంకరణలో భక్తులకు ధర్శనమిస్తారనిచెప్పారు. ఈ సందర్భంగా కలశ స్థాపన ఉంటుందన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా సాయంత్రం 5 గంటలకు శృంగేరి ఆస్థాన విద్వాంసుడు వేణుగోపాల్ బృందంచే నాదస్వర కచేరి ఉంటుంది. అనంతరం అద్వైత సిద్ధి రత్నాకర శాస్త్రనిధి బ్రహ్మ శ్రీపాద సుబ్రహ్మణ్యం దేవి భాగవతంపై ప్రవచనాలు ప్రారంభమవుతాయి. అలాగే జొన్నలగడ్డ శ్రీరామ్ బృందంచే కర్ణాటక గాత్ర కచేరీ ఉంటుందన్నారు.

నేటి నుంచి శివంలో బతుకమ్మ సంబురాలు



శివం మందిరం

నల్లకుంట: నల్లకుంట శివంలో గురువారం(నేటి) నుంచి 12వ తేది వరకు నిర్వహించనున్న శారదా శరన్నవరాత్రి బతుకమ్మ వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని శ్రీ సత్య సాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ఎ. మల్లేశ్వర్ రావు తెలిపారు. బుధవారం శివం ప్రాంగణంలో మీడియాతో ఆయన మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకల వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా తొమ్మిది రోజుల పాటు ప్రతి రోజు ఉదయం 6 గంటలకు వేదపారాయణ ఉంటుందని, సాయంత్రం 7 గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, భజన. సాయిబాబా దవ్య సందేశం , మంగళ హారతి, ప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు. వేడుకల్లో చివరి రోజైన 12వ తేదీ విజయ దశిమి పర్వ దినాన ఎదయం 8 గంటలకు చండీ హోమం, పూర్ణాహుతి ఉంటుందని వివరించారు. ఈ సందర్భంగా నిర్వహించే కుంకుమ పూజలో హైదరాబాద్ జిల్లాలోని 16 సత్యసాయి సేవా సమితిల నుంచి 160 జంటల దంపతులు పాల్గొంటారని తెలిపారు. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనాలని ఆయన కోరారు.

పేదల బతుకులను ఆగం చేయొద్దు



గోల్నాకలో మూసీ నిర్వాసితులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

- మూసీ సుందరీకరణ పేరుతో ప్రభుత్వం చేస్తోంది తప్పు
- సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

అంబర్‌పేట: మూసీ సుందరీకరణ పేరిట దాని పరీవాహక ప్రాంతంలో నివసిస్తున్న పేద ప్రజలను ప్రభుత్వం భయభ్రాంతులకు గురిచేస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మండిపడ్డారు. బుధవారం మూసీ నిర్వసితులకు భరోస ఇచ్చేందుకు గోల్నాకలోని కృష్ణనగర్ లంకబస్తీల్లో స్థానిక పార్టీ నాయకులతో కలిసి బస్తీల్లో పర్యటించారు. బాధితులకు ఆయన భరోసా ఇచ్చారు. లంక బస్తీలో గుండె పోటుతో మృతి చెందిన నిర్వాసితుడు కుమార్ కుటుంబాన్ని ఓదార్చారు. కూల్చివేతలతో మృతి చెందిన వారిని ప్రభుత్వ హత్యలుగా తాము భావిస్తున్నామని అన్నారు. మూసీ పరీవాహక ప్రాంతంలో పేదలను తరలించి కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే ప్రయత్నాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట నాయకులు డీజీ నరసింహారావు, ఎం శ్రీనివాస్, మహేందర్, రాములు, సుబ్బారావు, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

బలమైన విద్యార్థి సంఘం అవసరం

ముషీరాబాద్: విద్యానగర్ మార్క్స్ భవన్‌లో బుధవారం న్యూ అస్సాం స్టూడెంట్స్ అసోసియేషన్, పీడీఎస్‌యూ, ఆల్ ఇండియా రెవల్యూషనరీ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ వెస్ట్ బెంగాల్ తదితర విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఐక్యత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా 14 మంది సభ్యులతో ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ కమిటీని ఏర్పాటు చేసి పీడీఎస్‌యూ ఆల్ ఇండియా ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్‌గా పశ్చిమ బెంగాల్‌కు చెందిన ప్రియం బసును ఎన్నుకున్నారు. ఈ అఖిల భారత కమిటీలో రాష్ట్రం నుంచి నామాల ఆజాద్, రామకృష్ణ, నర్సింహారావు, కర్ణాటక నుంచి తిమన్న, ఒరిస్సా నుంచి భవానీ, ఏపీ నుంచి రాజేష్, పవిత్ర, అస్సాం నుంచి మనోజ్, నాయన్, ఢిల్లీ నుంచి తిరుపతి, మహారాష్ట్ర నుంచి హనుమంతు హండే, బెంగాల్ నుంచి అనిందిత, అహిర్‌లు అఖిల భారత కమిటిలో సభ్యులుగా నియమించారు. అఖిల భారత స్థాయిలో విద్యార్థి సంఘం అవసరమని గుర్తించి భావ సారుప్యత కలిగిన విద్యార్థి సంఘాలన్ని ఐక్యమయ్యాయని అన్నారు. బలమైన విద్యార్థి సంఘం అవసరం ఉందన్నారు.

మహాత్ముడికి ఘన నివాళి

మహాత్మా గాంధీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. అంబర్‌పేట/ముషీరాబాద్ నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, సంక్షేమ సంఘాలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు గాంధీజీ విగ్రహాలు చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహాత్మా గాంధీ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వారు కోరారు. పలు ప్రాంతాల్లో మహాత్మా గాంధీతో పాటు మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రీ జయంతి వేడుకలను సైతం నిర్వహించారు.

– అంబర్‌పేట/ముషీరాబాద్ జోన్ బృందం

వాడవాడలా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు







అంబర్‌పేట చౌరస్తాలో గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ ఎంపీ వీహెచ్, బీజేపీ నేతలు





కెనరా బ్యాంకు సమీపంలో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్



మహాత్మా గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రీల చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న వీఎస్ఆర్



సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నివాళులర్పిస్తున్న ప్రముఖులు

మత స్వేచ్ఛను హరించేందుకే వక్ఫ్ సవరణ బిల్లు

కవాడిగూడ: భారత రాజ్యాంగం కల్పించిన మత స్వేచ్ఛ హక్కులను కాలరాసేందుకే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వక్ఫ్ సవరణ 2024 తీసుకొచ్చిందని సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ సయ్యద్ అజీజ్ పాషా ఆరోపించారు. లోక్‌సభలో వక్ఫ్ సవరణ బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా ప్రతిపక్షం గట్టి ఎదురు దెబ్బ తగిలిన తరువాత బిల్లును సంయుక్త పార్లమెంటరీ కమిటీకి మోదీ ప్రభుత్వం ప్రతిపాదించడం సిగ్గుచేటన్నారు. వక్ఫ్ సవరణ బిల్లును 2024ను తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ తంజీమ్–ఏ–ఇన్సాఫ్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా పార్కు ధర్నా చౌక్‌లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

బడ్జెట్ స్కూల్స్ సమస్యలను పరిష్కరించాలి

కవాడిగూడ: రాష్ట్రంలోని 33 జిల్లాల్లో గల బడ్జెట్ పాఠశాలల సమస్యలను పరిష్కరించి కార్పొరేటు స్కూల్స్‌ను నియంత్రించాలని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.అనిల్‌కుమర్, కోశాధికారి కె.శ్రీకాంత్‌రెడ్డిలు కోరారు. బుధవారం నూతన కార్యవర్గం హైదరాబాద్ ఆర్జేడీఈ విజయలక్ష్మిని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని బడ్జెట్ పాఠశాలల సమస్యలను వివరించినట్లు పేర్కొన్నారు.

రేవంత్ సర్కార్‌కు సంపూర్ణ మద్దతు

నల్లకుంట: రేవంత్‌రెడ్డి సర్కారు అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని రెడ్డి సంఘాల ప్రతినిధులు పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలుపుతూ బుధవారం పూలే భవన్‌లో రెడ్డి సంఘాల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని రెడ్డి సంఘాల ప్రతినిధి బృందం ఏకగ్రీవ తీర్మాణం చేసింది.

వయోవృద్ధులను ప్రేమగా చూసుకోవాలి

కవాడిగూడ: లయన్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్-320ఏ, డిస్ట్రిక్ట్ 320డి, సీనియర్ సిటిజన్స్ ఫోరం గాంధీనగర్ సంయుక్త ఆధ్వర్యంలో దోమలగూడలోని ఏవీ కళాశాలలో 21వ వయోధికుల దినోత్సవం సందర్భంగా మెగా ఉచిత ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ముఠా గోపాల్, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం హాజరయ్యారు.

కుళ్లినస్థితిలో మహిళ మృతదేహం లభ్యం

కాచిగూడ: కుళ్లిన స్థితిలో మహిళ మృతదేహం లభ్యమైన సంఘటన కాచిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఇన్‌స్పెక్టర్ చంద్రకుమార్ తెలిపిన వివరాల ప్రకారం... కాచిగూడ రైల్వేస్టేషన్ సమీపంలో ఓ మహిళ (55) మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో గుర్తించడానికి వీలులేకుండా పోయింది. పోలీసులు మృతదేహన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ల అప్పగింత

చిక్కడపల్లి: సెల్‌ఫోన్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య అన్నారు. కె.హరీష్‌కుమార్ కుమార్, పి.స్వామి, ఎం.లింగం మూడు నెలల క్రితం చిక్కడపల్లి ప్రాంతాల్లో సెల్‌ఫోన్లను పోగొట్టుకున్నారు. సీఐఆర్ పోర్టల్ సహకారంతో ముగ్గురు ఫోన్లను ట్రేస్‌అవుట్ చేసి పట్టుకున్నారు. బుధవారం సంబంధిత వ్యక్తులకు ఫోన్లను అప్పగించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

ఇంకుడు గుంతల నిర్మాణమే లక్ష్యం

- అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



వ్యర్థాల తొలగింపు, ఇంకుడుగుంతల నిర్మాణం స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు

నల్లకుంట: నియోజక వర్గంలోని సీవరేజీ పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపుతో పాటు, భూగర్భ జలాల పెంపు లక్ష్యంగా నియోజక వర్గంలో ప్రత్యేక కార్యాచరణ చేపట్టినట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. భూగర్భ జలాల పెంపుదల, సమర్థవంతమైన మురుగు నీటి నిర్వహణ లక్ష్యంగా హైదరాబాద్ మెట్రోపాలిటన్ వాటర్ సప్‌లై సీవరేజీ బోర్డు (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ) చేపట్టిన 90 రోజుల ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం నల్లకుంట నరేంద్ర పార్కులో స్థానిక కార్పొరేటర్ అమృత, జలమండలి జీఎం రామకృష్ణతో కలిసి ఎమ్మెల్యే కాలేరు జండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. సీవరేజ్ ఫ్లో ఫ్రీ సిటీ మరియు భూగర్భ జలాలు పెంచడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక డ్రైవ్ కార్యక్రమం కొనసాగుతుందని చెప్పారు.

- ప్రతి ఒక్కరూ బాధ్యతగా తమ ఇంటి వద్ద ఇంకుడు గంతలు ఏర్పాటు చేసుకుని, భూగర్భ జలాల పెంపుకు సహకరించాలని కోరారు. ఇందు కోసం అవసరమైన సలహాలను సూచనలు జలమండలి అధికారులు అందిస్తారని తెలిపారు. ఇంటి విస్తీర్ణాన్ని బట్టి ఇండిపెండెంట్ ఇళ్లు, అపార్టుమెంట్ల యజమానులు ఎంత స్థలంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకోవాలో సంబంధిత శాఖ అధికారులు సూచిస్తారని చెప్పారు.
- ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే ఇళ్లల్లోని వ్యర్థాలను కబ్బామోరీ, డ్రైనేజీ పైపుల్లో వేయకుండా ఇంటింటికి వచ్చే స్వచ్ఛ ఆటోల్లోనే వేయాలని చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జలమండలి డిప్యూటీ జీఎం విష్ణువర్ధన్ రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ రోహిత్, బీఆర్ఎస్, బీజేపీ నాయకులు, జలమండలి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నరేంద్ర పార్కులో ఇంకుడు గుంతల నిర్మాణ పనుల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కాలేరు



బాగ్ అంబర్‌పేటలో స్వచ్ఛ భారత్‌లో ఎమ్మెల్యే కాలేరు, డీఎంసీ మారుతీ దివాకర్

పరిసరాల పరిశుభ్రతతోనే ఆహ్లాదకర వాతావరణం

అంబర్‌పేట: పరిసరాల పరిశుభ్రత ఆహ్లాదకర వాతావరణానికి ఎంతో దోహదపడుతుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛతా హీ సేవా 2024 కార్యక్రమంలో భాగంగా అంబర్‌పేట నియోజకవర్గంలో జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో విస్తృత కార్యక్రమాన్ని నిర్వహించారు. పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది బుధవారం ఉదయం నుంచే వివిధ ప్రాంతాల్లో ఉన్న చెత్త డంపింగ్ కేంద్రాల వద్ద రంగులు చల్లి ముగ్గులు వేశారు. బాగ్ అంబర్‌పేటలో నిర్వహించే కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే హాజరయ్యారు. స్వచ్ఛ భారత్ స్ఫూర్తితో పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ప్రజల సహకారంతో నియోజకవర్గాన్ని క్లీన్ అండ్ గ్రీన్‌గా తీర్చిదిద్దాడం సాధ్యమవుతుందన్నారు. నిత్యం పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బంది నియోజకవర్గాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు. ఉత్తమ బాధ్యతలు నిర్వహించిన సిబ్బందిని ఆయన అభినందించారు. అలాగే గోల్నాకలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్, అంబర్‌పేటలో జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ విజయ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట డీఎంసీ మారుతీ దివాకర్, ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమాలత, బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, శ్రీరాములు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ప్రపంచంలోనే అతిపెద్ద బీమా పథకం



విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న డాక్టర్ కె.లక్ష్మణ్

ముషీరాబాద్: ప్రపంచంలోనే అతి పెద్ద బీమా పథకం ఆయుష్మాన్ భారత్‌ను ప్రవేశపెట్టిన ఘనత ప్రధాని నరేంద్రమోదీకే దక్కుతుందని ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ కొనియాడారు. ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకొని సెప్టెంబర్ 16 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు సేవా పక్వాడ కార్యక్రమం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బుధవారం ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా వడ్డెర బస్తీ కమ్యూనిటీ హాల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని, నల్లకుంట ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డా. కె. లక్ష్మణ్ మాట్లాడుతూ.... దేశంలోని పది కోట్ల కుటుంబాలకు ఐదు లక్షల ఆరోగ్య బీమా అందిస్తున్నామని అన్నారు. పేద ధనిక అనే తేడా లేకుండా ఈ పథకాన్ని వర్తింపజేస్తున్నామని తెలిపారు. జీజీ ట్రస్ట్ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పైడి రాకేష్‌రెడ్డి ఫౌండేషన్ డైరెక్టర్ సుచరితరెడ్డి, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రోయ్యూరు శేషసాయి, డివిజన్ అధ్యక్షులు ఆర్.నరేష్, మాజీ డివిజన్ అధ్యక్షులు సాయికృష్ణయాదవ్, ఎం.మోహన్, సుబ్రహ్మణ్యంబాబు, కౌండిన్య ప్రసాద్, కిషోర్, మాధవి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.